క్లుప్తంగా

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మహాత్మ గాంధీ ఉపాధి పథకం సంబంధించి బహిరంగ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేసి వాటిలో అవకతవకలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సుండుపల్లె : మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ, కరువపల్లెలోని వినాయకుడి గుడి వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ తిరుపతి వారిచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

19 నుంచి ధార్మిక కార్యక్రమాలు

రాజంపేట టౌన్ : మండలంలోని ములక్కాయలపల్లెలోని శ్రీకోదండరామాలయంలో ఈనెల 19వ తేదీ నుంచి టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 19న రామాయణం, 20న మహాభారతం, 21న భగవద్గీత, 22న కుంకుమార్చన, హరికథ, 23న భజన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక ప్రవచకులు మూడు రోజులపాటు ధార్మికోపన్యాసం చేస్తారని తెలియజేశారు.

నిర్వాసితులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


ఆర్ఆర్-5 పైలాన్ పూజల్లో రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట ఆర్ఆర్-5 నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంగంపేట ఆర్ఆర్-5 లే అవుట్ పైలాన్ నిర్మాణ భూమి పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు కేటాయించిన లాట్లలో ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చెన్నరాయుడు, కూటమి నాయకులు పుల పుత్తూరి రామసుబ్బారెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, కల్లా చలపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తకన్నప్ప జన్మస్థలిలో కార్తిక పౌర్ణమి వేడుకలు


గ్రామవీధుల్లో ఊరేగుతున్న శివపార్వతులు

రాజంపేట : శ్రీకాళహస్తీశ్వరుని అపరభక్తుడు భక్త కన్నప్ప జన్మస్థలి అన్నమయ్య జిల్లా రాజంపేట మండల ఊటుకూరు గ్రామంలో శుక్రవారం రాత్రి కార్తికపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్త కన్నప్ప పూజించిన శివాలయంలో ప్రత్యేకపూజలు జరిపారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం, భక్తకన్నప్ప విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం జ్వాలాతోరణం కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కడప - రేణిగుంట జాతీయరహదారి భక్తులతో కిక్కిరిసింది. శివనామస్మరణాలతో భక్తకన్నప్ప గుడి మార్మోగింది.

హరిహరాలయంలో పడిపూజ


పడిపూజలో భజనలు చేస్తున్న మాలధారులు

వీరబల్లి : మండలంలోని అయ్యప్ప మాలధారులు మండల కేంద్రంలోని హరిహరాదుల దేవస్థానంలో గురువారం రాత్రి ప్రత్యేక పడిపూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప విగ్రహానికి అభిషేకాలు, పూజలు నిర్వహించి అయ్యప్ప గుడిని లాగా అరటి కాండలతో ఏర్పాటు చేశారు. మండలంలోని అయ్యప్ప భక్తులు ఒక తాటికి చేరి అయ్యప్ప స్వామి భక్తిపాటలతో స్మరించారు. భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

పుస్తక ప్రదర్శన

సంబేపల్లె : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆ శాఖ అధికారి రెడ్డిశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో పలు రకాల పుస్తకాలు ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. రామాయణం, భాగవతం, మహాభారతం, నీతి కథలు, జీకే పుస్తకాలు, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలు చాలా రకాల పుస్తకాల ప్రదర్శించారు. చిత్రలేఖనం పోటీలు, వ్యాసరచనల పోటీలు నిర్వహించి 20న బహుమతులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పనుల పూర్తికీ పోరాడాలేమో?

- అసంపూర్తిగా ఆర్‌యూబీ పనులు
- కష్టాలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు
- రూ.1.50 కోట్లతో కేటాయిస్తే పనులు పూర్తి
- నిర్లక్ష్యంగా నాయకులు, అధికారుల తీరు


ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న ఆర్‌యూబీ పనులు


ఆర్‌యూబీ పనులు పూర్తి కాకపోవడంతో పట్టాలు దాటి వెళుతున్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని మంజూరు చేయించుకునేందుకు విద్యార్థులు, ఆర్‌యూబీ సాధన కమిటీ ప్రతినిధులు అనేక సంవత్సరాలు ఉవ్వెత్తున పోరాటాలు చేశారు. ఆ క్రమంలో అనేక మందిపై పోలీసులు కేసులు బనాయించినా వెరవకుండా పోరాటాలు సాగించడంతో దాదాపు ఎనిమిదేళ్ల క్రితం రైల్వే ఉన్నతాధికారులు దిగివచ్చి రాజంపేటకు అండర్ బ్రిడ్జిని మంజూరు చేశారు. అలాగే రైల్వేశాఖకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తిచేశారు. రైల్వేశాఖకు సంబంధించి ఆర్‌యూబీ పనులు పూర్తయి కొన్ని సంవత్సరాలైనా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పనులు పూర్తి కాకపోవడంతో ఆర్‌యూబీ అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఆర్‌యూబీ పూర్తయితే దాదాపు మూడువేల మందికి పైగా విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే పలు గ్రామాల ప్రజలు పట్టణంలోకి సులువుగా రాకపోకలు సాగించేందుకు ఆర్‌యూబీ సౌకర్యవంతంగా ఉంటుంది.

జరగరాని ప్రమాదం జరిగితే..

ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలకు చెందిన అనేక మంది విద్యార్థులు రైలు పట్టాలను దాటుకొని విద్యా సంస్థలకు వెళ్లి తిరిగి ఇళ్లకు వెళుతుంటారు. రాజంపేట రైల్వేస్టేషన్ మీదుగా ఎక్కువ సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఇక్కడి రైల్వేస్టేషన్‌లో ఆగని రైళ్లు అతివేగంగా వెళుతుంటాయి. విద్యార్థులు పట్టాలు దాటే సమయంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తే ఆర్‌యూబీ పూర్తవుతుంది. అందువల్ల ప్రభుత్వం ఆర్‌యూబీని త్వరితగతిన పూర్తి చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతుంది.

చాయ్ బిస్కెట్ సమావేశంగా ప్రజలు ఎద్దేవా

ఆర్‌యూబీ పోరాటాల ఫలితంగానే మంజూరైంది. విద్యార్థులు, ఆర్‌యూబీ సాధన కమిటీ ప్రతినిధుల పోరాటపటిమను సడలనివ్వకుండా ఆర్‌యూబీని సాధించుకున్నారు. అయితే అనేక సంవత్సరాలుగా ఆర్‌యూబీ అసంపూర్తిగా ఉన్నా ఇటు విద్యార్థుల్లో కాని అటు ఆర్‌యూబీ సాధన కమిటీ ప్రతినిధుల్లో అప్పటి పోరాట పటిమ కనిపించకపోవడంపై విమర్శలకు తావిస్తుంది. గతంలో వలే పోరాటాలు సాగిస్తే ప్రభుత్వం దిగిరాక తప్పదన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతుంది. ఆరు నెలల్లో ఆర్‌యూబీ పూర్తయ్యేందుకు తమవంతు కృషి చేస్తామని ఉత్తర, దక్షిణ ధృవాలుగా ఉండే బీజేపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు కలిసి గత నాలుగు నెలల క్రితం రైల్వేస్టేషన్ వద్ద సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసి ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ తరువాత బీజేపీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆర్‌యూబీ ఊసెత్తక పోవడంతో వారిది ఛాయ్‌బిస్కెట్ సమావేశమేనని పట్టణ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. కనీసం విద్యార్థి సంఘాలు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆర్‌యూబీ పూర్తి కావడం కోసం ఉద్యమాలు చేపడితే ఆర్‌యూబీని పూర్తి చేసేందుకు ప్రభుత్వం దిగిరాక తప్పదని ప్రజలు అంటున్నారు.

పట్టాలు దాటుకుని వెళుతున్నాం



కళాశాల ముగిశాక అందరు ఒకేసారి ఇళ్లకు వెళతారు. అందువల్ల ఫ్లెటైవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై ఎక్కువ మంది నడిచి వెళ్లేందుకు వీలు కాదు. అందువల్ల చాలా మంది విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో రైలుపట్టాలు దాటుకు వెళ్లాల్సి వస్తోంది. పొరపాటున జరగరాని ప్రమాదం జరిగితే ఏం కావాలి. అందువల్ల ఆర్‌యూబీని వెంటనే పూర్తి చేయాలి.

– గౌరి, విద్యార్థిని, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజంపేట

భయంగా వెళ్లాల్సి వస్తోంది



రాజంపేట పట్టణం నుంచి సైకిల్‌పై కళాశాలకు వెళతాను. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వాహనాలన్నీ వేగంగా వెళుతుంటాయి. అందువల్ల బ్రిడ్జిపై వెళ్లినంత సేపు భయంగా వెళ్లాల్సి వస్తుంది. బ్రిడ్జిపై వెళ్లేటప్పుడు గతంలో యాక్సిడెంట్లు జరిగి విద్యార్థులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదం జరగకముందే ప్రభుత్వం ఆర్‌యూబీని పూర్తి చేయాలి.

– హరిప్రసాద్, విద్యార్థి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజంపేట

ఆందోళనలకు ప్రణాళికలు



ఆర్‌యూబీ పూర్తికావడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం. అవసరమైతే ఆర్‌యూబీ సాధన కమిటీని మళ్లీ పునరుద్ధరిస్తాం. తొలుత విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళనలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారులు స్పందించి సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి.

– చిట్వేలి రవికుమార్, సీఐటీయూ జిల్లా నాయకుడు, రాజంపేట

అభివృద్ధి పనులు గుర్తించండి


మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు : మండలంలో అభివృద్ధి పనులు గుర్తించాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన మండల సచివాలయాల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ఎన్ఆర్ఈజీఎస్ వర్క్స్, రాజ్యసభ ఎంపీ ల్యాండ్స్ పనులలో నాణ్యత పర్యవేక్షణ, అభివృద్ధి ఎక్కడ అవసరం అనేది గుర్తించి మండల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి మండల అభివృద్ధి నిధులు ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, విధి నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాతమ్మ, పంచాయతీ ఏఈ గంగులయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణ, సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, ఎంపీటీసీ-2 సోమిశెట్టి సునీత, సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగసుబ్బయ్య, మన్సూర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

నందలూరు : గుండ్లూరు గ్రామానికి చెందిన చాపాటి బ్రహ్మయ్య 15 మద్యం బాటిళ్లు తీసుకువెళ్తుండగా హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్‌కు సమాచారం రావడంతో స్థానిక బస్టాండ్ కూడలిలో అతని వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం


కళాజాతా ప్రదర్శనలో ఎల్ఐసీ యూనియన్ నేతలు

రాయచోటి అర్బన్ : అందరం కలసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం అంటూ ఎల్ఐసీ యూనియన్ సెంట్రల్ జోన్ కళాజాత సభ్యులు తిరుపతయ్య, సుజాతలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ అంశంపై ఎల్ఐసీ యూనియన్ కళాజాతా ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రాధాన్యతను కళాత్మకంగా ప్రజలకు చేరవేసి వాటిని కార్పొరేట్ల బారి నుంచి కాపాడుకోవడమేనని అన్నారు. దేశం ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, వ్యవసాయం, పరిశ్రమలు, స్టీల్, రైల్వేలు, ఆయిల్ రంగాలలో స్వంత కాళ్లపై నిలబడడానికి ప్రభుత్వరంగ సంస్థలే కారణమన్నారు. ఆ సంస్థలను బలహీనపరచడం దేశానికి మంచిది కాదన్నారు. ఎల్ఐసి, పోస్టల్, విశాఖ స్టీల్ ప్లాంట్ రంగాల విశ్వసనీయతకు, బీఎస్ఎన్ఎల్ ఇటీవల తిరిగి పుంజుకోవడానికి, ఇప్పటికీ జాతీయ, గ్రామీణ బ్యాంకులకు ప్రజల మద్దతు కొనసాగడానికి ఆయా సంస్థల మంచి పనితీరే కారణమన్నారు. విద్య, విద్యుత్, ఆరోగ్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగాల్సిన పరిస్థితిని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదన్నారు. కళాజాతాలో భాగంగా ఎల్ఐసీ యూనియన్ కళాకారులు నాటికల ప్రదర్శన, పాటలు పాడడం, నృత్యాలు చేయడం జరిగింది. కార్యక్రమంలో హైదరాబాద్ యూనియన్ నేతలు గిరిధర్, మద్దిలేటి, స్థానికనేతలు వేణుగోపాల్ రాజు, ఆదినారాయణరెడ్డి, కళ్యాణ్, విశ్వనాథ్, శ్రీకృష్ణదేవరాయలు, సువర్ణ, జయరాంతోపాటు పలు యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

కమనీయం.. త్రేతేశ్వరస్వామి కల్యాణం

- హత్యరాలలో పోటెత్తిన భక్తులు
- మడుగులో కార్తీకదీపాలు పెట్టిన మహిళలు
- పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి


గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్న ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన హత్యరాల త్రేతేశ్వరస్వామి ఆలయంలో శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవంను ఘనంగా నిర్వహించారు. కావుటూరి ఫౌండేషన్ ట్రస్ట్ అధినేత కావుటూరి సుబ్రమణ్యం, వెంకటరమణ దంపతులు స్వామివార్లకు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ కమిటీ, ప్రధానఅర్చకులు పద్మనాభస్వామి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. కార్తికపౌర్ణమి సందర్భంగా రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విశేషసంఖ్యలో హాజరయ్యారు. వేడుకలకు మన్నూరు సీఐ ఎస్ఎంఆలీ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించారు. మడుగు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ డిపో మేనేజరు రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సర్వీసును నడిపించారు. హత్యరాలలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు కళాకారులు చేసిన సంగీత నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

జలహారతి.. గిరిప్రదక్షిణ

హత్యరాలలో శుక్రవారం రాత్రి గిరిప్రదక్షిణలో భక్తులు పోటెత్తారు. హత్యరాల మడుగు వద్ద రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి కార్తిక పౌర్ణమి వేడుకలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ దండు గోపి, నాయకులు సుబ్బరాజు, కల్యాణ్‌రెడ్డి, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న 108 సిబ్బంది

ఒంటిమిట్ట : రాష్ట్రవ్యాప్తంగా 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఆయా మండల అధికారులకు 108 సిబ్బంది వినతిపత్రాలను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ రమణమ్మకు, మండల ప్రజా పరిషత్ అధికారి సోమశేఖర్‌లకు ఒంటిమిట్ట మండల 108 సిబ్బంది వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీస్‌లను నిర్వహించాలని, అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం స్లాబ్‌ల ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించి సర్వీసులను బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలోని ఈఎంటీ పోస్టులలో 108 ఈఎంపీలను నియించాలని, పైలెట్ల ఈఎంటీలకు ఇతర కాలనీలో వారివారి అర్హతలను బట్టి వెయిటేజీ ఇచ్చి నియమించాలన్నారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, సహజ మరణం, ప్రమాదాలలో చనిపోయిన ఉద్యోగులకు రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన జీఓఎంఎస్ నెంబర్ 49 ప్రకారం అమలు చేసిన నెలకు రూ. 4 వేలు తిరిగి పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, 108 సేవలో ప్రస్తుతం ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల 108 ఉద్యోగులు నాగబాబు, పెంచలబాబు, ఎరికలయ్య, భాస్కర్, విజయ్ కుమార్, నరేంద్రలు పాల్గొన్నారు.

శివకోటికి అరుదైన పురస్కారం


అవార్డు అందుకుంటున్న శివకోటి

నందలూరు : డిజేబుల్డ్ క్రికెట్‌లో 20 ఏళ్లపాటు అంతర్జాతీయ, జాతీయస్థాయిలో భారత జట్టుకు, ఆంధ్ర రాష్ట్రానికి సేవలందించినందుకు గాను నందలూరుకు చెందిన అలుసూరు శివకోటికి భారత సేవారత్న, నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డును అందుకున్నారు. నవంబర్ 14వ తేదీన రాయచోటిలో టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డిల చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శివకోటి శుక్రవారం మాట్లాడుతూ తనకు అవార్డు వచ్చేలా సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీదారులకు వేగంగా పరిష్కారం చూపాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గాలివీడు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను త్వరగా పరిష్కారం చూపేలా సత్వర చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఎ.శ్రీనినివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందిన ప్రతి అర్జీని ప్రాధాన్యతగా ఎప్పటికప్పుడు బాధ్యతాయుతంగా పరిష్కరించాలన్నారు. మండలస్థాయిలో వచ్చిన అర్జీలను అధికారులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యపై అవగాహన కలిగించుకుని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం గోరాన్ చెరువు గ్రామంలో భూ సమస్యలు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎక్కువగా రావడం పట్ల వీఆర్ఓ రవీంద్రారెడ్డి పనితీరుపై మండిపడ్డారు. అనంతరం చుక్కల భూములు, ఇనాం భూములు, రీ వెరిఫికేషన్, సచివాలయం సేవలైన క్యాష్ట్, ఇన్‌కం, బర్త్ సర్టిఫికెట్లను సకాలంలో విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీదారులతో స్వయంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడి స్థానిక అధికారుల పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్ఓలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

రాజంపేట : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజంపేట డిపో వద్ద వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ గేట్‌మీటింగ్ నిర్వహించారు. కార్మికులకు మెరుగైన రీతిలో విధులు నిర్వహించేలా అధికారులతో చర్చలు జరుపుతామన్నారు. డ్యూటీ చార్ట్ విషయంలో వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల పక్షాన ఉంటుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వం పరంచేసి, అందులో పనిచేసేవారి భవిష్యత్తుకు బాట వేసింది వైఎస్సార్ ప్రభుత్వం అనేది కార్మికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. డిపోలో ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే డిపో మేనేజరుతో సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. డిపో కార్యదర్శి పి.నరసింహులు మాట్లాడుతూ మంగళంపల్లె సర్వీసును మార్చడం వల్ల చార్ట్‌డ్యూటీ కండక్టర్‌కు నిద్రలేకుండా చేస్తోందన్నారు. రీజనల్ చైర్మన్ సీసీ మణ్యం మాట్లాడుతూ డిపో అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. తప్పుడు ఆరోపణలు, విమర్శలు మానుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు గల్లా చంద్ర, రీజనల్ నాయకులు కెవీరమణ, వైఎస్‌రాజు, కేజీనాయుడు, డిపో నాయకులు పీఆర్ చంద్ర, కేఆర్‌ఆర్‌రెడ్డి, ఎల్ఎల్‌రెడ్డి, శివరాం, టీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తిక శోభ

కార్తిక మాసంలో వచ్చే పౌర్ణమికి ఎంతో విశిష్టత సంతరించుకుంది. అందువల్ల రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని అన్ని శివాలయాల్లో భక్తులు వేకువజాము నుంచే శివాలయాలు భక్తజన సాగరాలయ్యాయి. ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని శివాలయాల్లో దీపాలు వెలిగించారు. మమ్ము చల్లగా చూడాలని, శుభాలునొసగాలని వేడుకున్నారు. అలాగే ఆయా శివాలయాల్లో వివిధ పేర్లతో కొలువుదీరిన పార్వతీ పరమేశ్వర్లును మనసారా తిలకించి తరించారు. ఈ సందర్భంగా విశేషంగా పూజలు నిర్వహించారు. ఈశ్వరా.. పరమేశ్వరా మము కాపాడయ్యా అంటూ వరపడ్డారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అంతటా భక్తుల సందడి కనిపించింది.

– రాజంపేట టౌన్


సుండుపల్లె: దీపాల వెలుగుల్లో సిద్దేశ్వర ఆలయం


రాజంపేట టౌన్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి


రైల్వేకోడూరు అర్బన్: మల్లికార్జున స్వామి దేవస్థానంలో వైభవంగా జ్వాలా తోరణం


సంబేపల్లె: మోటకట్ల వెంకట శివసాయి ఆలయంలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న మహిళలు


రామాపురం: అలంకరణలో మూలస్థానేశ్వరుడు


రాయచోటి టౌన్: అలంకరణలో అఘోరలింగేశ్వరుడు


గాలివీడు: ప్రత్యేక అలంకరణలో శివలింగం


చిట్వేలి: అలంకరణలో శ్యామలాంబ


నందలూరులో...


పుల్లంపేట శివాలయంలో..


ఓబులవారిపల్లె: గౌరీ సిద్దేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


రాయచోటి టౌన్: భక్తులతో కిటకిటలాడుతున్న వీరభద్రస్వామి ఆలయం


సిద్దవటం: నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


రాజంపేట టౌన్: అన్నపూర్ణ దేవి సమేత అగస్త్యేశ్వర స్వామి కల్యాణోత్సవం


ఒంటిమిట్ట: కార్తిక దీపాల వెలుగులు


చిన్నమండెం: మల్లూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు